క్లుప్తంగా

కలెక్టరేట్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆవేదన వ్యక్తం చేస్తున్న అంజనేయులు

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్ ఎదుట ముజఫర్ నగర్‌కు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. తన ఇంటి శ్లాబ్ పనులను పక్కింటి వాళ్లు అడ్డుకోవడంతో న్యాయం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చాడు. అయితే అతను కలెక్టర్‌ను కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆయన తన ఆటోలోని డీజిల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

సబ్ రిజిస్ట్రార్లకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నూతనంగా వచ్చిన ఎస్.నసీర్, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి వెళ్తున్న హజీమియ్యాలకు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. దస్తావేజు లేఖర్ల సాయంతో ఇబ్బందులు లేకుండా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేశానని హజీమియ్యా పేర్కొనగా.. ముమ్ముందు కూడా దస్తావేజు లేఖర్ల సాయం కొనసాగాలని నూతన సబ్ రిజిస్ట్రార్ ఎస్.నసీర్ ఆకాంక్షించారు.

రేపు విద్యాసంస్థల బంద్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

కర్నూలు(సెంట్రల్) నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలంటూ ఈనెల 4వ తేదీన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేజీ టూ పీజీ వరకు విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని మీడియా పాయింట్ దగ్గర బంద్‌కు సంబంధించిన పోస్టర్లను పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లాలోని విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయి, శరత్ అశోక్, రమణ, దామోదర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ టవర్స్‌పై 33 కేవీ లైన్ లాగుతున్నందున బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. సిరినోబుల్ ఫీడర్ పరిధిలోని ఏడు టవర్లపై లైన్ లాగుతున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకేసుల రోడ్, శ్రీకృష్ణ కాలనీ, అశోక్ నగర్, తుంగభద్ర కాలనీ, స్టేట్‌బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ, నేతాజీ నగర్, ధనలక్ష్మి నగర్, అమీన్‌హైదర్ నగర్ పరిసర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: నారాయణ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించినా పాఠ్యపుస్తకాలు ఇవ్వడం లేదని, విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు అబుబాకర్, సహాయ కార్యదర్శులు మల్లేష్, ఆర్యన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాల్సిన నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం తమకు ఆ చట్టం వర్తించదు అన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

సీనియర్ పాస్టర్ ఆర్.జార్జిరాజు మృతి


జార్జిరాజు(ఫైల్)

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక బుధవారపేట గుడ్ షప్పర్డ్ చర్చిలో 30 సంవత్సరాలకు పైగా దేవుని పరిచర్య చేస్తున్న సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఆర్. జార్జిరాజు (85) మంగళవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న పాస్టర్‌ను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం పాస్టర్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్చిలకు, చర్చి పాస్టర్లకు, క్రైస్తవ కుటుంబాలకు ఆయన సుపరిచితులు. ఇండియన్ ఈవాంజికల్ మిషన్ అనే సంస్థలో సుదీర్ఘకాలం సహాయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

పెంచిన జీతాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీ సమగ్ర శిక్ష ఉద్యోగులకు గత ప్రభుత్వం పెంచిన వేతనాలు చెల్లించాలని, సమ్మెకాలానికి సంబంధించిన రోజులకు సంబంధించి కూడా వేతనాలు ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జె.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అన్ని జిల్లాల్లో పెంచిన జీతాలు ఇస్తున్నారని, కర్నూలు జిల్లాలో మాత్రమే ఇవ్వడం లేదన్నారు. తక్షణమే అధికారులు పరిశీలన చేసి జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు



ప్రభుత్వాసుపత్రి నుంచి గాయత్రి ఎస్టేట్ వరకు రోడ్డు సైడు ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు : ప్రధాన రహదారుల్లో వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రోడ్డు సైడు వ్యాపారులను ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరించారు. రోడ్డు సైడు తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారుల నుంచి ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం ఉదయం ప్రభుత్వాసుపత్రి నుంచి గాయత్రి ఎస్టేట్ వరకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న తోడుపు బండ్లు, మొబైల్ క్యాంటీన్లను స్వాధీనం చేసుకుని కొత్తపేటలోని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు మీద తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా జీవనం సాగించాలని సూచించారు. మరోసారి పోలీసు ఆంక్షలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

11 ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు (టౌన్) : నగర శివారులోని సుంకేసుల రోడ్డులో ఉన్న సంజీవని ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి 11 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి వెల్లడించారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఈఈఓ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): డయేరియాపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశాలకు హెచ్ఈఈఓ శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ముజఫర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేది వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలు మొదలైన అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. కావున ఆశా కార్యకర్త తన పరిధిలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లలున్న ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల వాడకంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. డయేరియా వ్యాధి వచ్చిన పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్‌మాత్రలు అందించాలని, ఈ వ్యాధి రెండు, మూడు రోజులకు తగ్గిపోయినా కూడా జింక్ మాత్రలు 14 రోజుల పాటు తప్పనిసరిగా వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో పెన్షన్ రివిజన్ వెంటనే చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పెన్షనర్లు

కర్నూలు(అర్బన్): బీఎస్ఎన్ఎల్‌లో పెన్షన్ రివిజన్‌ను వెంటనే చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్, డీఓటీ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ. రామలింగం, ఎల్. విజయభాస్కర్ మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉందన్నారు. 2010 అక్టోబర్ 1వ తేదీకి ముందు టెలికాం శాఖలో ఉద్యోగంలో చేరి బీఎస్ఎన్ఎల్‌లో అబ్సార్బ్ అయిన అనంతరం పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ సవరణ జరగాల్సి ఉందన్నారు. ఏడు సంవత్సరాలైనా పెన్షన్‌ను సవరించడంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందన్నారు. కేంద్ర పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు పలుమార్లు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు, పోస్టు కార్డు ఉద్యమాలు చేపట్టామన్నారు. అలాగే సంబంధిత మంత్రులు, ప్రధానమంత్రికి ఈ మెయిల్ ద్వారా తమ డిమాండ్‌ను పంపినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ సాధనకు దీక్షలు చేసినా, ఫలితం నేటికి దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఖాజామోదీన్, సహాయ కార్యదర్శి షేక్‌షబ్బీర్, సుంకన్న, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యాకోబు, రంగయ్య, వెంకటరామిరెడ్డి,వి. వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, శాంతి, అంజనీబాయి, ఫాతిమాఖాతూన్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేడీఎస్ఎస్ఎస్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు పీఠాధిపతి మహా ఘన గోరంట్ల జ్వానేషు

కర్నూలు (టౌన్) : కేడీఎస్ఎస్ఎస్ (కర్నూలు డయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ) ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు పీఠాధిపతి మహా ఘన గోరంట్ల జ్వానేషు అన్నారు. మంగళవారం నగర శివారులోని ఆ సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా సంస్థ, సౌత్ ఇండియన్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఠాధిపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జీవనోపాధిపై శిక్షణ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో రాణించిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సౌత్ ఇండియన్ బ్యాంకు డీజీఎం శశిధర్, ఏపీ ఎస్ఎస్ఎస్ ఎగ్జిక్యూటీవ్ కార్యదర్శి ఫాదర్ టీపీ ప్రసాద్, క్లస్టర్ హెడ్ షహబాజ్, బ్రాంచ్ మేనేజర్ సుధీర్‌కుమార్, ఫాదర్ భాస్కర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని బర్తరఫ్ చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్‌లో హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ డిమాండ్ చేశారు. మంగళవారం వీహెచ్‌పీ–బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వెంటనే రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు. లౌకిక దేశంలో ఉంటూ హిందూమతాన్ని కించపరచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలి నరసింహ, గోవిందరాజు, ఈపూరి నాగరాజు, సాయిరామ్, రాము, నాగరాజు పాల్గొన్నారు.

హిందువులను కించపరచడం తగదు

ఇతర మతాలను ప్రసన్నం చేసుకునేందుకు పార్లమెంట్ సాక్షిగా హిందువులను కించపరిస్తే ఎలా అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినుషారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆమె బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..హిందువులను హింసాత్మకంగా అభివర్ణిస్తూ పార్లమెంట్‌లో లోక్‌సభ సభ్యుడు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశాన్నిమత ప్రతిపాదికన విడగొట్టేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నగనూరు రాఘవేంద్ర, పీటీ సాయిప్రదీప్, మురళీనాయుడు, లోకేశ్వరయ్య పాల్గొన్నారు.

మద్దూరులో వ్యక్తి దారుణహత్య

- కత్తులు, కొడవళ్లతో వెంటాడి హతమార్చిన దుండగులు
- తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇటీవల గ్రామానికి వచ్చిన మృతుడు


హత్యకు గురైన దూదేకుల పెద్ద దస్తగిరి

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో వ్యక్తిని వెంటాడి కత్తులతో హతమార్చిన ఘటన మంగళవారం కలకలం రేపింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల ఉసేనమ్మ కుమారుడు దూదేకుల పెద్ద దస్తగిరి (50) మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామం మద్దూరు అయినా జీవనోపాధి, చిన్న గొడవల కారణంగా బేతంచెర్ల మండలం అంబాపురంలో నివాసం ఉంటున్నాడు. తల్లి ఉసేనమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారం క్రితం గ్రామానికి వచ్చి తల్లికి చికిత్స చేయిస్తున్నాడు. దస్తగిరి ఇంటి వద్ద ఉన్నాడని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు, మరో ముగ్గురు కారులో వచ్చారు. ఇంటి సమీపంలో దిన్నెపై కూర్చొని ఉన్న దస్తగిరిని కత్తులు, కొడవళ్లతో వెంటాడి హత్య చేశారు. అనంతరం అదే కారులో పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల, గొంతు భాగాల్లో గాయాలను గుర్తించారు. హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య ఫాతిమా, కొడుకు, కుమార్తె ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న మద్దూరులో హత్య జరగడంతో ఒక్కసారిగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ముమ్మరంగా హైపోక్లోరేట్ పిచికారీ

కర్నూలు (టౌన్) : దోమల నివారణకు నగరంలో హైపోక్లోరేట్ పిచికారీ ముమ్మరం చేశారు. కాలనీలతో పాటు మురుగు కాల్వలు, కేసీ కెనాల్‌లో నిలిచిన మురుగు నీటిలో పిచికారీ చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. 1 వ శానిటేషన్ డివిజన్ నుంచి పిచికారీ ప్రారంభించామని చెప్పారు. ప్రతి రోజు 5 వేల లీటర్లకు పైగా సోడియం హైపోక్లోరేట్ రసాయనాన్ని మంత్రి టీజీ అందిస్తున్నారన్నారు. కేసీ కెనాల్ మొత్తం పిచికారీ చేసిన తరువాత 6 ట్రాక్టర్లలో నగరంలోని అన్ని డివిజన్లలో ఈ కార్యక్రమం చేపడతామన్నారు.

శుభ్రపరిచిన నీటిని సరఫరా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్) : నగర ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కొన్ని వార్డులకు బురదనీటిని సరఫరా చేస్తున్నారన్నారు. తద్వారా డయేరియా,మలేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబులుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్‌బాష, విజయ్, గౌతవ్, విక్రమం, వీరేష్ పాల్గొన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ

- ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చిన బీవీ
- రేపు 121వ జయంతి


బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువ బడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది.ఉపముఖ్యమంత్రి, స్పీకర్ పదవులకు వన్నె తెచ్చిన పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి 121 జయంతిని గురువారం నిర్వహించేందుకు ఆయన వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌పార్టీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమేకాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. బీవీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలపాటు శాసనసభ స్పీకర్‌గా పనిచేసి రేనాటిఖ్యాతిని నలువైపులా వ్యాపింప చేశారు.

నేడు 'నందీశ్వరుడి'కి ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి బుధవారం ప్రదోషకాలంలో అభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాసోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ బహుళ త్రయోదశి, మహాప్రదోష కాలంలో సాయంత్రం నాలుగు గంటలకు అభిషేకం ఉంటుందన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొనాల్సిన భక్తులు గంట ముందుగానే ఆలయంలోకి రావాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన గాత్ర కచేరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద నెల్లూరుకు చెందిన మల్లాది అనూష, బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. శివ శివ శంభో, కాలభైరావాష్టకం, ఆనందామృత, విజయాంబికే, సకల మంత్రముల, అంబావాణీ, గౌరీ మనోహర, వినాయకుని వలెను, జయజయదేవి, మహిషాసురమర్దిని, శ్రీ చక్రరాజ సింహాసనేశ్వరి, కైలాసగిరివాసా, కాళింగనర్తన, దుర్గాదేవి దురిత నివారిణి, కామకోటిపీఠవాసిని తదితర గీతాలను అష్టకాలను మల్లాది అనూష తదితరులు ఆలపించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన పెద్దాసుపత్రి అధికారులు


కలెక్టర్ రంజిత్‌బాషాతో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి


జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తున్న కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాను మంగళవారం సాయంత్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రి విషయాలపై చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సమస్యలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.

కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి వారు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భవాని ప్రసాద్, కల్కూరా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జాతీయ పోటీలకు రాష్ట్ర రగ్బీ జట్టు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మహిళా జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 4 వ తేదీన మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళల రగ్బీ పోటీలకు జట్టును ఎంపిక చేశారు. ఆ వివరాలను రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం వెల్లడించారు. ఎంపికయిన క్రీడాకారులకు ఆయన స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

4న బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలికలు 2008, 2009, 2010 సంవత్సరంలో జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకుని రావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6, 7, 8 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 98662 11480 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జయహో భారత్


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులు

కర్నూలు (లీగల్): భారతజట్టు టీ20 వరల్డ్ కప్ సాధించి తిరిగి వస్తుండటంతో జిల్లా న్యాయవాదుల సంఘం కార్యాలయంలో న్యాయవాదులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇలాంటి విజయాలను టీమిండియా మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షులు రవిగువేరా, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సీవీ శ్రీనివాసులు, క్రీడల కార్యదర్శి బంగి సుధీర్ పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు


జాతీయ పోటీలకు ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కర్నూలు (టౌన్): వచ్చే నెల మూడో వారంలో విజయవాడలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి చెందిన నిహాల్ (బాలుర విభాగం), కీయాన (బాలికల విభాగం)లో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ షేకూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 22 నుంచి 24 వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 8వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి ఆర్చరీపోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

కేఎంసీకి క్రీడాపరికరాలు విరాళం


ప్రిన్సిపాల్‌కు క్రీడాపరికరాలు అందజేస్తున్న కర్నూలు సైకియాట్రిక్ సొసైటీ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీకి కర్నూలు సైకియాట్రిక్ సొసైటీ క్రీడాపరికరాలను విరాళంగా అందజేసింది. మంగళవారం వీటిని సొసైటీ సభ్యులు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మకు అందజేశారు. ఇందులో క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఆడటం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం కూడా కలుగుతుందన్నారు. సొసైటీ వారు క్రీడాపరికరాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ గంగాధర్ నాయక్, డాక్టర్ యతిరాజు, డాక్టర్ సుమంత్, డాక్టర్ చైతన్య, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శంకర్, డాక్టర్ విజయ్‌బాబు, పాల్గొన్నారు.

యానిమేటర్లను ఇబ్బంది పెడితే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

కర్నూలు (టౌన్): రాజకీయాల పేరుతో యానిమేటర్లను (వీఓఏ) ఇబ్బందులు పెడితే ఆందోళన తప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అక్రమంగా యానిమేటర్ల తొలగింపులను తక్షణం మానుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యానిమేటర్ల సంఘం అధ్యక్షుడు గుంటెప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా యానిమేటర్లను తప్పించడం సరికాదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే అత్యధికంగా అందులో పనిచేస్తున్నారన్నారు. వారు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి యానిమేటర్లను తొలగిస్తే ఊరుకోమన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కుమార్, వెంకటస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలు ఉపయోగించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు శారదాదేవి

కల్లూరు: ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే టప్పుడు తప్పనిసరిగా బోధనోపకరణాలు ఉపయోగించాలని సాల్ట్ ప్రోగ్రామ్ రాష్ట్ర పరిశీలకురాలు వి.శారదా దేవి అన్నారు. ఈ నెల 1 నుంచి 10 తేదీ వరకు కల్లూరు మండలం పెద్దపాడులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఏపీ సమగ్ర శిక్ష, ఎస్సీఆర్టీ ఆధ్వర్యంలో బోధనోపకరణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని శారదా దేవి పరిశీలించారు. ' ట.బెళగల్, గూడూరు, కల్లూరు, కోడుమూరు, క్రిష్ణగిరి, కర్నూలు, ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాల పరిధిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించే టీచ్ ప్రైమరీ, టీచ్ సెకండరీ పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలన్నారు. తద్వారా ఎంపిక చేసిన ఎనిమిది మండలాల పరిధిలోని 188 మంది టీచ్ అబ్జర్వర్లు తయారు అవుతారన్నారు. కె.ప్రవీణ్‌కుమార్, ఎస్.మహబూబ్ బాషా, బి.బాల తిమ్మారెడ్డి, వెంకటరాముడు, సుజాత, రమేష్, శేఖన్న, ఏకనాథ్ మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.